నేను కాంగ్రెస్‌లోకి వెళ్లడం లేదు

- నాపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- నా కుమారుడి వివాహానికి పార్టీలకు అతీతంగా శుభలేఖలు ఇస్తున్నాను
- బీజేపీ ఎంపీ సోయం బాబురావు వెల్లడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లుతున్నట్లు వస్తున్న వార్తలను ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబురావు ఖండించారు. పార్టీ మారుతున్నట్లు తనపై వస్తున్న ప్రచారం అవాస్తవమని ఆయన తేల్చేశారు. కొందరు వ్యక్తులు కావాలని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మంగళవారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 27న తన కుమారుడి వివాహం ఉందని, అందువల్లనే శుభలేఖలు అన్ని పార్టీల నేతలకు ఇస్తున్నానని ఎంపీ బాబురావు తెలిపారు. పార్టీలకు అతీతంగా పెళ్లికి రావాలని వివిధ పార్టీల నేతలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే సీఎం కేసీఆర్, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డినిసైతం పెళ్లికి ఆహ్వానిస్తున్నట్లు, ఇందులో ఎలాంటి ఉద్దేశ్యం లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డితో ఎలాంటి విభేదాలు లేవన్నారు. మహేశ్వర్‌రెడ్డిని బీజేపీలోకి ఆహ్వానించింది తానేనని ఆయన పేర్కొన్నారు. తనపై జరుగుతున్న తప్పుడు ప్రచారం వెనక బీఆర్ఎస్ హస్తం ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. కర్ణాటకలో గెలిచినంతా మాత్రాన కాంగ్రెస్ పార్టీ దేశమంతా గెలిచినట్లు కాదన్నారు. బీజేపీ ఓడిపోయిన ఓట్ల శాతం తగ్గలేదన్నారు.

ఎవరెన్ని కుట్రలు చేసినా... వచ్చేది మేమే

- కాంగ్రెస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి
- ప్రతిపక్షాల ఝూటా మాటలను నమ్మొద్దు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఉమ్మడి వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో: ఎవరెన్ని మాయోపాయాలు చేసినా.... ఎవరు ఎన్ని కుట్రలు చేసినా... మాయమాటలు చెప్పినా.. వచ్చే ఎన్నికల్లో అధికారం మళ్లీ బీఆర్ఎస్‌కేనని.. సర్వేలన్నీ బీఆర్ఎస్ పార్టీకే అనుకూలంగా ఉన్నాయనిరాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం తొర్రూర్ మున్సిపాలిటీ కేంద్రంలో పలు వార్డులకు సంబంధించిన పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, పాలకుర్తి నియోజకవర్గంలోనూ నాదే గెలుపు...80 వేల మెజార్టీ గ్యారంటీగా గెలుస్తానని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ లాంటి మూర్ఖులు, దుర్మార్గులు ఏవేవో మాట్లాడుతారు. ప్రతిపక్షాల ఝూటా మాటలు నమ్మొద్దని, రాబోయే ఐదేండ్లల్లో కావాల్సిన అభివృద్ధికి ప్రణాళికలు ఇప్పుడే రూపొందించుకుందామన్నారు. జనరంజకంగా పాలన చేస్తున్న సీఎం కేసీఆర్‌కు జనమంతా అండగా ఉండాలని, కాంగ్రెస్, బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు మంత్రి పిలుపునిచ్చారు.

రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ లాంటి మూర్ఖులు, దుర్మార్గులు ఏవేవో మాట్లాడుతారు

రేవంత్‌రెడ్డి, బండి సంజయ్‌లు మూర్ఖులు, దుర్మార్గులు, అబద్దాలతో ప్రజల్ని మోసం చేయడానికి చూస్తున్నారన్నారు. అలాంటి వాళ్ల నుంచి ప్రజల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడ మనపై ఉందన్నారు. ప్రజలు వారి ఝూటా మాటలు నమ్మొద్దన్నారు. అందుకే పార్టీ శ్రేణులు అలాంటి వాళ్ల మాటల్ని తిప్పికొట్టాలని, ప్రజల్ని చైతన్యం చేయాలని మంత్రి అన్నారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా నిరుద్యోగ భృతి ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా.. అని ప్రశ్నించారు. రూ. 500లకే మించి ఎక్కడైనా పెన్షన్ ఇస్తున్నారా.. రూ. 2 వేలకు మించి రైతు బంధు తరహాలో పెట్టుబడికి నిధులు ఇస్తున్నారా.. ఆలోచించుకోవాలని, ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయని విధానాలు, తెలంగాణలో అమలు చేస్తామని ఎన్నికల కోసం, ఓట్ల కోసం కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని మంత్రి మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి రాగానే రూ.200లకు గ్యాస్ సిలెండర్ ఇస్తామని చెప్పి రూ. 1200లు చేశారని, పెట్రోల్, డిజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు విపరీతంగా పెంచి అన్ని వస్తువుల ధరల పెరుగుదలకు కారకులై నేడు ధరలు తగ్గించాలని ధర్నాలు చేస్తుండటం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు.

సర్వేలన్నీ నావైపే.. 80వేల మెజార్టీ నాకే..

పాలకుర్తి నియోజకవర్గంలోనూ మరోసారి తానే విజయం సాధించి తీరుతానని మంత్రి ఎర్రబెల్లి భరోసానిచ్చారు. గతంలో కంటే మెజార్టీ అధికమై 80 వేలు దాటుతుందన్నారు. ప్రజలు అభివృద్ధిని, సంక్షేమాన్ని చూస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు అబద్దాలు చెబుతున్నాయి. తనకు ఎవరూ ఎదురు నిలిచినా..గెలవలేరని, గతంలో ఎన్నడూ లేనంతగా పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, ఇదంతా అద్దంలా కనిపిస్తుందని మంత్రి చెప్పారు.

రాబోయే ఐదేళ్లల్లో కావాల్సిన అభివృద్ధి ప్రణాళికలు ఇప్పుడే

ఇప్పటికే పాలకుర్తి నియోజకవర్గంలో మండలాల వారీగా, గ్రామాల వారీగా అభివృద్ధి, సంక్షేమాల్లో తిరుగులేని ప్రగతిని సాధించామని మంత్రి తెలిపారు. ఆయా శాఖల వారీగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను మంత్రి పార్టీ శ్రేణులకు వివరించారు. పురాతన దేవాలయాలకు పూర్వవైభవం తెచ్చాం..సీఎం కేసీఆర్ ఆశీస్సులతో ప్రజల సహకారంతో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నాను. వారి రుణం తీర్చుకునే విధంగా అభివృద్ధి చేశానని, రోడ్లు పూర్తయ్యాయి, డ్రైనేజీ, సీసీరోడ్లు, అంతర్గత రోడ్లు అయ్యాయి. మంచినీరు అందుతున్నదని, ప్రముఖ చారిత్రక పర్యాటక కేంద్రంగా పాలకుర్తి వల్మిడి, బమ్మెరలను మారుతున్నాయిన్నారు. ఒక్కో గ్రామానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేశానన్నారు. ఒక్క తొర్రూర్ పట్టణానికే రూ. 200 కోట్లతో అభివృద్ధి చేశానని మంత్రి తెలిపారు. రాబోయే కాలంలో జరగాల్సిన అభివృద్ధిప్రణాళికలు కూడా ఇప్పుడే రూపొందించుకుంటామని, ఆవిధంగా అభివృద్ధిలో నియోజకవర్గాన్ని రాష్ట్రానికి, దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు.

పంట నష్ట పరిహారం ఇంకెప్పుడిస్తారు?

- ఎకరాకు రూ. 10 వేలు ఇస్తామన్న హామీని కేసీఆర్ నిలబెట్టుకోవాలి
- కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆకాల వర్షాలు, వడగండ్ల వానలతో రాష్ట్రంలో దాదాపు 7 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి తెలిపారు. అయితే పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు ఇస్తామన్న ప్రభుత్వం.. ఇప్పటి వరకు పైసా సాయం ఎందుకు చేయలేదని ఆయన నిలదీశారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ తో కలిసి మీడియాతో మాట్లాడారు. పంట నష్టపరిహారంపై సీఎస్‌ను కలిసేందుకు అయింట్‌మెంట్ అడిగినా ఇవ్వవడం లేదని, రైతుల అంశాలపై మాట్లాడుతామంటే ఇవ్వరా..? అని ఆయన ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లై, రెవిన్యూ అధికారుల మధ్య ఏమాత్రం సమన్వయం, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ కూడా చేయకపోవడంతో పాటు ప్రయివేటు అప్పుల మీద ప్రభుత్వానికి కంట్రోల్ లేదన్నారు. కేంద్రం కూడా పట్టించుకోవడం లేదని కోదండరెడ్డి విమర్శించారు. 15వ ఫైనాన్స్ నుంచి రాష్ట్రానికి రూ. 1600 కోట్లు వచ్చాయని, ఆ డబ్బులు ఏమైనాయో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే అంశాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎందుకు అడగటం లేదని కోదండరెడ్డి ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీలు కలిసి రాజకీయ డ్రామాలు చేయడమే కానీ ప్రజల సమస్యలను పరిష్కరించాలని సోయి లేదని విమర్శించారు.

ప్రారంభానికి సిద్ధంగా.. ఆత్మగౌరవ భవనాలు

- నిర్మాణ దశలో మరికొన్ని భవనాలు
- నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- భవనాల పనుల పురోగతిని పరిశీలించిన మంత్రి గంగుల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవ భవనాలను నాణ్యతతో నిర్మించాలని అధికారులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. ప్రారంభానికి సిద్ధంగా యాదవ, కురుమ ఆత్మగౌరవ భవనాలున్నాయన్నారు. మిగతా భవనాల నిర్మాణాలకు అవసరమైన మౌలిక సదుపాయాల్ని వేగంగా అందజేస్తూ వాటిని సైతం త్వరలో పూర్తిచేస్తామన్నారు. మంగళవారం నాడు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, అధికారులు, బీసీ సంఘాల నేతలతో కలిసి హైదరాబాద్ కోకాపేటలో ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. రెవెన్యూ, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, ఎలక్ట్రిసిటీ ఇతర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మగౌరవ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. రోడ్లతో పాటు సమాంతరంగా ఎలక్ట్రిసిటీ, వాటర్ వర్క్స్ పనులను పూర్తి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ వేలకోట్ల విలువైన స్థలాలను హైదరాబాద్ నడిబోడ్డున కోకాపేట్, ఉప్పల్ భగాయత్ వంటి ప్రాంతాల్లో బీసీలకు కేటాయించి, వాటి నిర్మాణంలో సైతం ఆయా కుల ఏక సంఘాల ట్రస్టులకే బాధ్యత అప్పగించామన్నారు. మొత్తం 87.3 ఎకరాల్లో రూ. 95.25 కోట్లతో 41 కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలను కేటాయించామని తెలిపారు. కోకాపేటలో యాదవ, కురుమ ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. మున్నూరు కాపు, ముదిరాజ్, గౌడ, బసవేశ్వర భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. అనంతరం మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనం డిజైన్లను మంత్రి పరిశీలించారు కార్యక్రమంలో అధికారులు, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

చరిత్రలో గొప్ప నిర్ణయం

- కేసీఆర్‌కు ధన్యవాద సభలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ బ్యూరో : దేశ చరిత్ర లో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా పరిపాలనా కేంద్రానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టడం తులంగాన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఘనతేనని, ఇది చరిత్రలో లిఖించదగిన అంశమని రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. దేశంలోనే అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుతో పాటు సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి నందుకు కృతజ్ఞతగా అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద సీఎం కేసీఆర్ కు ధన్యవాద సభ నిర్వహించారు. తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులర్పించి, అనంతరం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, బాబా సాహెబ్ అంబేద్కర్ పేరు రాష్ట్ర సచివాలయానికి పెట్టడం ఒక చారిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. సీఎం కేసీఆర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని కొనియాడారు. అణగారిన కులాలంటే అందరికి తక్కువ చూపు అని అన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా మనం పనిచే యాలని, మనల్ని తప్పుగా చిత్రీకరించే వాళ్లకు బుద్ధి చెప్పాలన్నారు. ఓట్ల కోసం, అధికారం కోసం మనం కావాలి కానీ, పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు ఎందుకు పెట్టరని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం పెట్టాలని ఎమ్మెల్సీ కవిత నిరాహారదీక్ష చేపట్టారని గుర్తు చేశారు. దళితులకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే అని అన్నారు. తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో దోపిడీ చేస్తే అక్కడి ప్రజలు బీజేపీని తరిమి కొట్టారన్నారు. రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం, దళిత బంధు, రైతు బంధు, కళ్యాణ లక్ష్మీ లాంటి పథకాలంటే బీజేపీ నాయకులకు ఇష్టం లేదన్నారు. కార్యక్రమంలో టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడ రాజీవ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడా గెలుస్తాం

- ఏఐసీసీ మీడియా కమిటీ చైర్మన్ పవన్ ఖేరా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కర్ణాటక ఫలితాలు చారిత్రాత్మకమైనవని ఏఐసీసీ మీడియా కమిటీ చైర్మన్ పవన్ ఖేరా అన్నారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రయివేట్ హోటల్‌లో టీ పీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి,చామల కిరణ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అనిల్, పార్టీ అధికార ప్రతినిధులు రియాజ్ తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ 48 సభల్లో మాట్లాడారని, అయినా బీజేపీని ఆ రాష్ట్ర ప్రజలు తిరస్కరించారని ఆయన తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు ప్రధానికి పట్టవన్నారు. తెలంగాణలో మత సామరస్యానికి దెబ్బ తీసే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు.

సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్‌కు విశేష స్పందన

- నేటి నుంచి అదనంగా మరో 8 కోచ్‌లు
- 1128కి పెరగనున్న సీట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సికింద్రాబాద్- తిరుపతి మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కోచ్‌ల సంఖ్య పెరగనుంది. ఈ రైలుకు ప్రయాణికుల నుంచి వస్తున్న విశేష స్పందన దృష్ట్యా బుధవారం నుంచి అదనంగా మరో 8 కోచ్‌లను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఈ రైలు కోచ్‌ల సంఖ్య 16కు చేరుకోనుండగా, 530గా ఉన్న సీట్ల సంఖ్య అదనపు కోచ్‌ల ఏర్పాటుతో 1128కి చేరనుంది. దీంతో పాటు సికింద్రాబాద్-తిరుపతి, తిరుపతి-సికింద్రాబాద్ మధ్య రెండు వైపులా ప్రయాణ సమయం కూడా 15 నిమిషాల వరకు తగ్గనుంది. ప్రస్తుతం ఈ రైలు 8-30 గంటల వ్యవధిలో గమ్యస్థానం చేరుకుంటుండగా, బుధవారం నుంచి 8-15 నిమిషాలకే చేరుకోనుంది. కాగా, ప్రతీ రోజూ వందలాది మంది భక్తులు హైదరాబాద్ నుంచి తిరుపతి పుణ్యక్షేత్రాన్ని సందర్శించేందుకు తరలి వెళతారు.దీంతో తిరుపతికి వెళ్లే అన్ని రైళ్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. గత నెల 8న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సికింద్రాబాద్ స్టేషన్ నుంచి వందేభారత్ రైలును ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి వంద శాతానికి పైగా ఆక్యుపెన్సీతో నడుస్తోంది. అయితే, కోచ్‌లు, సీట్లు పరిమితంగా ఉన్న కారణంగా చాలా మంది వందేభారత్ రైలులో ప్రయాణించలేకపోతున్నారు. వందేభారత్ రైలును ప్రారంభించినప్పుడు ఎగ్జిక్యూటివ్ క్లాస్‌తో పాటు 7 చైర్ కార్లు మాత్రమే ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ రైలులో మొత్తం 44,922 మంది ప్రయాణించినట్లు ద.మ.రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి 21,798 మంది, తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు 23194 మంది ప్రయాణించారు. కాగా, బుధవారం నుంచి కొత్తగా అందుబాటులోకి రానున్న 16 కోచ్‌లలో 14 చైర్‌కార్‌లు ఉంటాయనీ, వీటిలో 1024 మంది ప్రయాణం చేస్తారని ద.మ.రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ వెల్లడించారు. దీంతో ప్రయాణికుల సంఖ్య 1128కి పెరగనుందనీ, కోచ్‌ల సంఖ్యను పెంచడం వల్ల ఎక్కువ మంది ప్రయాణం చేయగలుగుతారని పేర్కొన్నారు. ప్రస్తుతం వేసవి సెలవుల దృష్ట్యా ప్రయాణికుల డిమాండ్ కూడా ఎక్కువగానే ఉందని ఈ సందర్భంగా జైన్ వెల్లడించారు.

సూర్యాపేటలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్

- వేదికలు పరిశీలించిన రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రావుల శ్రీధర్ రెడ్డి

సూర్యాపేట, ప్రభన్యూస్: సూర్యాపేట మరోమారు క్రీడలకు వేదికకానుంది. ఈ నెల 25 నుండి 27 వరకు సూర్యాపేట వేదికగా రాష్ట్ర స్థాయి యూత్ ఛాంపియన్‌షిప్ బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ జాతీయ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సాహం కల్పిస్తారని పేరు గడించిన రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి, స్థానిక శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీష్ రెడ్డి మూడు రోజుల పాటు జరుగు ఛాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యం అందించనున్నారు. వసతి, భోజనాది సౌకర్యాలను సొంత ఖర్చులతో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రం నలుమూలల నుండి 40 జట్లు ఈ పోటీలలో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందుకు అనువైన మైదానాలు ఏర్పాట్ల కోసం మంత్రి జగదీష్ రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి స్థానిక జూనియర్ కళాశాల మైదానంతో పాటు సూర్యాపేట శివారులోని లయోలా పాఠశాలమైదానాన్ని పరిశీలించారు.

COROMANDEL AGRO PRODUCTS AND OILS LTD.,
CIN.NO-L15143TG1975PLC001967
12-B, Skylark Apartments, Basheerbagh, HYDERABAD - 500 029.
Website: capoil.in, E-mail: capoil@capoil.in

బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశ నోటీసు

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మెస్సర్స్ కోరమండల్ ఆగ్రో ప్రొడక్ట్స్ & ఆయిల్స్ లిమిటెడ్, సెబి (LODR) రెగ్యులేషన్స్, 2015, రెగ్యులేషన్ 29 (1)(a)ను అనుసరించి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ యొక్క సమావేశము నం.1/2023-24, శుక్రవారము ది.26 మే 2023 న ఉదయము 11:00 గంటలకు కంపెనీ యొక్క ఆఫీస్ చేయబడిన మార్చి 31, 2023 తో ముగిసిన త్రైమాసిక/సంవత్సరానికి ఆర్థిక నివేదికలను ఆమోదించుట కొరకు గజువరంలోని కేపిల్, యమ్.యల్ ప్రెమిసెస్, గజువరం, గంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నిర్వహించుటకు నిర్ణయించబడినది.

కోరమండల్ ఆగ్రో ప్రొడక్ట్స్ & ఆయిల్స్ లిమిటెడ్
Sd/- మేనేజ్ శేఖర్ (డిన్ నెం.02951004)
హోల్ టైం డైరెక్టర్ మరియు సి.ఈ.ఓ.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 16-05-2023

తెలంగాణ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

ఎన్‌బిటి నెం. 05/ఆర్‌డి/డివి/హెచ్‌డి/డి2/2023-24 తేది: 15.05.2023

2 (రెండు) పనుల కొరకు నమోదిత సంస్థలు/కాంట్రాక్టర్లు తరగతి -V మరియు అపై గల వారి నుండి కార్యనిర్వాహక ఇంజనీర్ (ఆర్ & బి) రంగారెడ్డి జిల్లా, గోషామహల్ వారిచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్‌లో టెండర్లు స్వీకరించబడును. 1) రూ.5.33 లక్షలు, 2)రూ. 3.78 లక్షలు. టెండర్లు స్వీకరించుటకు చివరి తేది : 20.05.2023న మ॥3.30గం॥ల వరకు. టెండర్లు తెరచుటకు చివరి తేది :20.05.2023 న సా॥4.00గం॥లకు. ఇతర వివరాలను వెబ్ సైట్ www.'e'procurement.gov.in వద్ద 17.05.2023న సా॥4.00గం॥ల నుండి చూడగలరు.

సం/- కార్యనిర్వాహక ఇంజనీర్ (ఆర్&బి)
Ro No.379-DP/CL/Advt/1/2023-24
Dt. 16.05.2023

తెలంగాణలోనూ 30శాతం కమీషన్

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కర్ణాటక రాష్ట్రంలో 40 శాతం కమీషన్ తీసుకునే బీజేపీకి ఆ రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ అన్నారు. తెలంగాణలోనూ 30 శాతం కమీషన్ తీసుకునే ప్రభుత్వం నడుస్తోందని, ఇక్కడి ప్రభుత్వానికి కూడా ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. మంగళవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతు.. సీఎం కేసీఆరే స్వయంగా కమీషన్లు గురించి మాట్లాడరని తెలిపారు. దళిత బంధు విషయంలో 30 శాతం తీసుకుంటున్న విషయాన్ని కేసీఆర్ చెప్పారని ఆయన గుర్తు చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించిన స్ఫూర్తితో తెలంగాణలో పార్టీ నేతలందరం ముందుకు వెళ్లుతామని, ఈ కమీషన్లప్రభుత్వాన్ని ఓడిస్తామన్నారు.

డీఏఓ పేపర్ కొనుగోలులో మరో ముగ్గురి అరెస్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నపత్రాల కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. పేపర్ లీకేజీ కసులో మరో ముగ్గురు అరెస్టు అయ్యారు. క్రాంతి, శశిధర్, రవితేజలను సిట్ అధికారులు అరెస్టు చేసినట్లు సమాచారం. మురళీధర్ దగ్గర నుంచి డీఏఓ పేపర్‌ను క్రాంతి, శశిధర్ తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. డీఏఓ పేపర్‌ను సాయి, లౌకిక్ దగ్గర నుంచి రవితేజ కొనుగోలు చేసినట్లు తెలిసింది. ముగ్గుర్ని అరెస్టు చేసి రిమాండ్‌కు సిట్ అధికారులు తరలించారు. పేపర్ లీకేజీ కేసులో అరెస్టుల పర్వం ఇంకా కొనసాగుతునే ఉంది. ఈకేసుతో సంబంధం ఉన్న 30 మందిని అరెస్టు చేశారు. ఇదిలా ఉంటే మరోవైపు నిందితులు బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేసుకుంటున్నారు. షరతులతో కూడిన బెయిల్‌ను ఇప్పటికే పలువురు నిందితులకు కోర్టు మంజూరు చేసింది.

నేడు పాలిసెట్ పరీక్ష

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లకోసం నిర్వహించే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఈరోజు జరగనుంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చే ర్యాంకును బట్టి ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లను కల్పించనున్నారు. ఈ పరీక్షకు నిమిషయం నిబంధనను అధికారులు అమలు చేయనున్నారు. పరీక్ష నిర్వహణకు 296 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1,05,656 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఒక గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని విద్యార్థులను అధికారులు సూచించారు. నిమిషయం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు.

44వేల టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు భర్తీ చేయండి

- విద్యాశాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడిలో ఆర్.కృష్ణయ్య డిమాండ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 44 వేల టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాజ్యసభసభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌